క్లుప్తంగా

జీజీహెచ్‌కు ఫొటోథెరపీ యూనిట్ వితరణ



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి ఎల్ఈడీ ఫొటోథెరపీ యూనిట్‌ను శనివారం జియోటెక్ హెల్త్ కేర్ ఇండియా నిర్వాహకులు సుంకర గోపీకృష్ణ బహూకరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి మాట్లాడుతూ పిల్లలు పుట్టిన సమయంలో కొంతమందికి జాండిస్ వస్తుందని, ఈ పరికరం ద్వారా దాన్ని గుర్తించి చికిత్స చేయవచ్చని తెలిపారు. ఈ యూనిట్ విలువ రూ. 25 వేలకు పైగా ఉంటుందన్నారు. పరికరాన్ని అందజేసిన గోపీకృష్ణను ఆమె అభినందించారు. కార్యక్రమంలో బయోమెడికల్ ఇంజినీర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డాక్టర్ నాగూర్ బాషాకు అవార్డు



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ షేక్ నాగూర్‌బాషా ఏపీ నుంచి తొలిసారిగా భూషణ్ పురస్కార్ అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లో ఈ నెల 21న గ్లోబల్ స్కాలర్స్ ఫౌండేషన్ నిర్వహించిన సమావేశంలో పద్మశ్రీ డాక్టర్ సాయిబాబా గౌడ్ చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. రోగులకు ఉత్తమ సేవలు అందించినందుకు ఫౌండేషన్ ఈ అవార్డును అందజేసింది.ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి డాక్టర్ షేక్‌నాగూర్‌బాషాను అభినందించారు. రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆమె ఆకాంక్షించారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



పట్నంబజారు: వాహనదారులంతా పర్యావరణాన్ని కాపాడాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు చెప్పారు. గుంటూరు ఆర్టీవో, ట్రాఫిక్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నగరంలోని హిందూ కళాశాల సెంటర్‌లో మిషన్ లైఫ్ కార్యక్రమం నిర్వహించారు. రెడ్‌సిగ్నల్ పడిన సమయంలో వాహనదారులు ఇంజన్ ఆపివేసి కాలుష్యాన్ని తగ్గించే దిశగా, పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు గోపాల్, తోట రాఘవరావు, కె.మల్లేశ్వరి, సౌజన్య, ప్రసాద్, ఉషాకిరణ్, ట్రాఫిక్ సీఐ అశ్కేశ్వరరావు పాల్గొన్నారు.

పాఠశాలలు ప్రారంభం రోజే యూనిఫాం పంపిణీ



కాకుమాను:మండలంలోని విద్యార్థులకు పాఠశాలలు పునఃప్రారంభం రోజునే యూనిఫాం అందజేయనున్నట్లు ఎంఈవో కె.ఎఫ్.కెనడీ తెలిపారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రానికి శనివారం యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, డిక్షనరీలు చేరినట్లు చెప్పారు. మండలంలో మొత్తం బాలికలు 1412 మంది, బాలురు 969 మందికి గాను ఒక్కొక్కరికీ మూడు జతల యూనిఫాం అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 13,622 పాఠ్య పుస్తకాలు, 436 డిక్షనరీలు కూడా చేరినట్లు చెప్పారు. పాఠశాల ప్రారంభానికి ముందే ఆయా పాఠశాలల హెచ్ఎంలకు వీటిని పంపిణీ చేయనున్నట్లు ఎంఈవో కెనడీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో న్యాయవాది మృతి

త్రిపురాంతకం మండలం బీఆర్ జంక్షన్ సమీపంలో ఘటన

త్రిపురాంతకం: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న యువ న్యాయవాది మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. త్రిపురాంతకం మండలం బీఆర్ జంక్షన్ సమీపంలో శుక్రవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. బైక్‌పై గుంటూరు నుంచి శ్రీశైలం వెళ్తున్న గుంటూరు పట్టాభిపురానికి చెందిన యువ న్యాయవాది షణ్ముఖ శ్రీరామ్ (27), సురేంద్రబాబులను గుర్తుతెలియని ట్రాక్టర్ ఢీకొట్టింది. గాయపడిన వారిని హైవే అంబులెన్స్‌లో మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించారు. అప్పటికే శ్రీరామ్ మృతిచెందాడు. సురేంద్రబాబు చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీవీ సైదులు తెలిపారు.

పేదలకు వైద్య పరీక్షలు అభినందనీయం

ఎమ్మెల్యే ముస్తఫా



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: పేదలకు వైద్య పరీక్షలు అభినందనీయమని ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా అన్నారు. పాత బస్టాండ్ సమీపంలోని లాలాపేటలో ఉన్న శ్రీ పద్మావతి ఆండాళ్ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం ఆలయ కమిటీ, అసిస్టెంట్ కమిషనర్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. పేదలకు వైద్య పరీక్షలు చేసి మందులు, పండ్లు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా మెడికల్ క్యాంపు ప్రారంభించిన ఎమ్మెల్యే ముస్తఫా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ పేద ప్రజలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సేవలు అభినందనీయమన్నారు. అనంతరం ఆయన్ను కమిటీ సభ్యులు దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జె.పి.ఎన్.రెడ్డి, ఏసీ జి.శ్రీనివాసరావు, వైద్యులు డాక్టర్ మౌనిక, డాక్టర్ ప్రభాకర్, సాయిచైతన్య, మాధవీలత, ఆలయ డైరెక్టర్లు శ్రీనివాసరెడ్డి, విశాలాక్షి, నరేష్, జ్యోతి, రత్నం, రామకోటేశ్వరరావు, అనిత, శివకుమార్ పాల్గొన్నారు.

ప్రాచీన యుద్ధ కళలు భారత్ సొంతం

మేయర్ కావటి



విద్యార్థులను అభినందిస్తున్న మేయర్

నెహ్రూనగర్: ప్రాచీన యుద్ధ కళలు భారత సొంతమని గుంటూరు నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు తెలిపారు. సిలంబం (కర్రసాము) అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మే 21న కోయంబత్తూర్‌లో నిర్వహించిన 4వ జాతీయ చాంపియన్‌షిప్– 2023లో నగరానికి చెందిన విద్యార్థులు సత్తా చాటారు. వివిధ కేటగిరీల్లో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించి జూన్‌లో సింగపూర్‌లో జరగనున్న అంతర్జాతీయ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు మేయర్‌ను మర్యాదపూర్వకంగా చాంబర్‌లో కలవగా, ఆయన వారిని సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పోటీల్లో నగరానికి చెందిన బండి అక్సా కీర్తన, బండి సంధ్యారాణి గోల్డ్ మెడల్స్, ఓలేటి సుస్మిత సిల్వర్, బ్రాంజ్ మెడల్స్, ఓలేటి సాయి కోటి ధీరజ్ రెండు సిల్వర్ మెడల్స్, బుట్టి చేతన సాయిప్రభ సిల్వర్, బ్రాంజ్ మెడల్స్, ఒంటెద్దు సంధ్యశ్రీ సిల్వర్ మెడల్స్ సాధించడం అభినందనీయమని తెలిపారు. కర్రసాము వంటి ప్రాచీన యుద్ధ కళలు భారత సొంతమని, నేటి యువత వాటిని కాపాడుకోవాలని ఆయన సూచించారు. సింగపూర్‌లో జరగనున్న పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరచి, గోల్డ్ మెడల్స్ సాధించి గుంటూరు నగరానికి పేరు, ప్రఖ్యాతులు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సిలంబం రాష్ట్ర చైర్మన్ ముంజంపల్లి శివకుమార్, కోచ్ కిరణ్ బాబు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ తప్పు కాదు

బీజేపీ సీనియర్ నాయకుడు, కేంద్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ జయప్రకాష్‌నారాయణ

గుంటూరు మెడికల్: పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం తప్పు కాదని, అమరావతిలో పేదల ఇళ్ల కోసం ప్రత్యేకంగా భూములున్నాయని బీజేపీ సీనియర్ నాయకుడు, కేంద్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వల్లూరు జయప్రకాశ్ నారాయణ పేర్కొన్నారు. గుంటూరు చంద్రమౌళీనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం కుట్ర పన్నిందని ఆరోపించారు. ఇతర ప్రాంతాల వారిని తెచ్చి మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల్లో గెలవాలనే ఆలోచనతో వారికి రాజధాని ప్రాంతంలో ప్రభుత్వం భూములు ఇస్తోందని ఆరోపించారు. బీజేపీ పశ్చిమ అసెంబ్లీ కన్వీనర్ తోట రామకృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతం చేయడమే లక్ష్యంగా అన్ని మండలాల్లో బూత్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పథకాల్ని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తెలియజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు వెంకటేష్ యాదవ్, పాలపాటి రవికుమార్, వెలగలేటి గంగాధర్, ఈమని మాధవరెడ్డి, భీమినేని చంద్రశేఖర్, అప్పిశెట్టి రంగా పాల్గొన్నారు.

నేడు ఫ్యాప్టో నిరసన ప్రదర్శన

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతుల ఉత్తర్వుల్లో అసంబద్ధ విధానాల్ని నిరసిస్తూ ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) పిలుపు మేరకు ఆదివారం ఉదయం 10 గంటలకు డీఈవో కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు తెలిపారు. కన్నావారితోటలోని సంఘ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బదిలీల ప్రక్రియలో ఉపాధ్యాయ పోస్టులు బ్లాక్ చేయడం తగదని, అన్ని ఖాళీల్ని చూపించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగోన్నతులకు ఖాళీల్ని చూపించకుండా విల్లింగ్, నాట్ విల్లింగ్ అడగడం సరైన పద్ధతి కాదని తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ. ఖాలీద్ పాల్గొన్నారు.

కౌన్సెలింగ్‌ను మాన్యువల్ విధానంలోనే నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గేరా మోహనరావు, నరసింహారావు, వేంకటేశ్వరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్‌ను మాన్యువల్ విధానంలో నిర్వహించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గేరా మోహనరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బదిలీల్లో అసంబద్ధమైన జీవోలు, స్పష్టత లేని నిబంధనలతో ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, వాటిని వెంటనే తొలగించాలని కోరారు. బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో ఏ ఒక్క ఖాళీని బ్లాక్ చేయడానికి వీల్లేదని, అన్ని కేటగిరీల్లో ఉన్న ఖాళీల్ని కోరుకునే అవకాశాన్ని కల్పించాలని విన్నవించారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా నరసింహారావు మాట్లాడుతూ అసంబద్ధ, అస్తవ్యస్త విధానాలతో స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగోన్నతులు పొందేందుకు ఉపాధ్యాయులు విముఖత వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగోన్నతులు చేపట్టక ముందే విల్లింగ్ ఇవ్వమని కోరడం ద్వారా పాఠశాలల్ని ఎంపిక చేసుకునే స్వేచ్ఛను హరించడమేనని, ఇది సరైన పద్ధతి కాదని వారు పేర్కొన్నారు. ముందుగా ఉపాధ్యాయ బదిలీలన్నీ సక్రమంగా పూర్తి చేసి, ఆ తర్వాత మాన్యువల్ కౌన్సిలింగ్ పద్ధతిలో ఉద్యోగోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ ఆర్థిక కార్యదర్శి సీహెచ్. వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పత్తిలో సమగ్ర యాజమాన్యంతో అధిక దిగుబడులు

రేపు గుంటూరులో పత్తి రైతులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న రాఘవరావు. పక్కన రఘురామిరెడ్డి, ప్రసాద్ తదితరులు

నగరంపాలెం: పత్తిలో సమగ్ర యాజమాన్యం (మోడల్ ప్లాట్స్)తో రైతులు అధిక దిగుబడులు సాధించినట్లు ఏపీ కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.రాఘవరావు తెలిపారు. గుంటూరు లక్ష్మీపురంలోని ఏపీ కాటన్ అసోసియేషన్ హాలులో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడల్ ప్లాట్ కింద 2022–23 సీజన్‌లో పత్తి సాగు చేసిన రైతులతో అసోసియేషన్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటలకు సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విశిష్ట అతిథిగా ప్రిన్సిపల్ కార్యదర్శి కె.సునీత, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు హాజరవుతారని చెప్పారు. ఏపీ టెక్స్‌టైల్స్ మిల్స్ అసోసియేషన్, ఏపీ కాటన్ సీడ్ క్రషర్స్ అసోసియేషన్ సహకారంతో ఈ సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పత్తి రైతులకు సాగు ఖర్చులు తగ్గించి, దిగుబడి పెంపొందించి వారికి అధిక ఆదాయం సమకూర్చేందుకు సమష్టి కార్యాచరణతో ముందుకెళ్లామని చెప్పారు. దీనిలో భాగంగా ప్రతి మోడల్ ప్లాట్ కింద 25 నుంచి 29 ఎకరాల్లో రైతులు కోరుకున్నట్టుగా పత్తి పంటలు పండించినట్లు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా పరిటాలలో 23.75 ఎకరాలు, గుంటూరు జిల్లా బేజాత్పురంలో 29.20 ఎకరాలు, పల్నాడు జిల్లా దాచేపల్లిలో 27.18 ఎకరాలు, లింగారావుపాలెంలో 27.11 ఎకరాలలో పత్తి పంటలు పండించినట్లు పేర్కొన్నారు. రైతులతో వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసి, వారికి నిరంతరం అందుబాటులో ఉంటూ, సాంకేతిక సలహాలు అందించినట్లు వెల్లడించారు. తద్వారా పత్తి నాణ్యత, దిగుబడి అధికంగా పెరిగిందని పేర్కొన్నారు. మోడల్ ప్లాట్‌ల్లో చీడపీడలు సైతం నియంత్రణలో ఉన్నాయని పలువురు రైతులు ఆనందం వ్యక్తం చేశారని తెలిపారు. వచ్చే సీజన్‌లో పత్తి విస్తీర్ణాన్ని పెంచే దిశగా ముందుకెళ్తున్నామని చెప్పారు. సాగు ఖర్చుల్ని తగ్గించడంతో పాటు ఎకరానికి 20 క్వింటాళ్ల అధిక దిగుబడి, ఎక్కువ ఆదాయంతో రైతును సుసంపన్నంగా ఉంచేందుకు చేపట్టిన కృషి సఫలీకృతమైందని వివరించారు. సమావేశంలో ఏపీ టెక్స్‌టైల్స్ మిల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘురామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సామినేని కోటేశ్వరరావు, ఏపీ కాటన్ సీడ్ క్రషర్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు విద్యాహక్కు చట్టం రెండో విడత ప్రవేశాలకు తుది గడువు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం–2009 ప్రకారం అర్హులైన పేద విద్యార్థులకు జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికి కేటాయించిన సీట్లలో చేరేందుకు తుది గడువు ఆదివారం ముగియనుందని డీఈవో పి.శైలజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రైవేటు పాఠశాలల్లో రెండో విడతలో 487 మంది విద్యార్థులకు కేటాయించిన సీట్ల జాబితాను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.డీఈవోజీఎన్‌టీ.బ్లాగ్‌స్పాట్.కామ్ కామ్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు. వెబ్‌సైట్‌లో ఉంచిన జాబితాలో సీట్లు పొందిన విద్యార్థులకు ఆదివారం ఆయా పాఠశాలల్లో ప్రవేశం ఖరారు చేయించుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. విద్యాహక్కు చట్టం కింద రెండో విడతలో ప్రవేశం పొందిన విద్యార్థుల్ని తప్పనిసరిగా చేర్చుకోవాలని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల్ని ఆదేశించారు. ప్రభుత్వ ఉత్తర్వుల్ని అమలు పర్చడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయమై తగిన చర్యలు చేపట్టాలని ఎంఈవోలను ఆదేశించారు.

వేసవి శిక్షణ శిబిరాలతో విద్యార్థుల్లో ఉత్సాహం



శిక్షణ పొందిన విద్యార్థులతో కృష్ణప్రసాద్, రథినీ చౌదరి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్ని ఉత్సాహపర్చేందుకే వేసవి శిక్షణ శిబిరాలు దోహదం చేస్తాయని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. జేకేసీ కళాశాల రోడ్డులోని స్కూల్లో శనివారం వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఆహ్లాదాన్ని పంచుతూ వారిలో సృజనాత్మకతను వెలికితీసే ఉద్దేశంతో నిర్వహించిన శిక్షణ శిబిరానికి స్పందన లభించినట్లు తెలిపారు. ఆటలు, క్రీడలు, సంగీత, నృత్య, ప్రతిభా పాటవ అంశాల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ వై.రథినీ చౌదరి మాట్లాడుతూ పిల్లలు బాల్యాన్ని ఆనందంగా, ఆహ్లాదంగా గడిపే విధంగా శిబిరాన్ని వివిధ అంశాలతో విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె. బసవపున్నయ్య, ఏవో కె. వెంకట్రావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నర్సింగ్ ట్యూటర్స్‌గా పదోన్నతి



ప్రమోషన్ ఆర్డర్స్ అందజేస్తున్న డాక్టర్ యాస్మిన్

గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ప్రభుత్వ సర్వీసులో స్టాఫ్ నర్సులుగా పనిచేస్తున్న 19 మందికి గ్రేడ్–2 నర్సింగ్ ట్యూటర్‌గా ప్రమోషన్ లభించింది. శనివారం గుంటూరులోని ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించి ఉమ్మడి మూడు జిల్లాల్లోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలు, నర్సింగ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న నర్సింగ్ ట్యూటర్ పోస్టులను ప్రమోషన్ ద్వారా భర్తీ చేశారు. ప్రభుత్వం 2020లో నర్సింగ్ కళాశాలల్లో ట్యూటర్ పోస్టులు భర్తీ చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రభుత్వ సర్వీసులో పనిచేస్తున్న నర్సింగ్ సిబ్బంది ద్వారా ట్యూటర్ పోస్టులు భర్తీ చేయాలని నోటిఫికేషన్‌లో పేర్కొంది. కొంత మంది బీఎస్సీ నర్సింగ్, ఎమ్మెస్సీ నర్సింగ్ అభ్యర్థులు ఇన్ సర్వీసు అభ్యర్థుల ద్వారా కాకుండా నేరుగా పోస్టులు భర్తీ చేయడం ద్వారా తమకు ఉద్యోగాలు లభిస్తాయని కోర్టులో కేసు దాఖలు చేశారు. దీంతో 2020 నుంచి ఉద్యోగ భర్తీ నోటిఫికేషన్‌పై కోర్టు స్టే విధించింది. ఇటీవల కాలంలో కోర్టు స్టే ఎత్తివేయడంతో శనివారం ఆర్డీ డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్ కౌన్సిలింగ్ నిర్వహించి ప్రమోషన్స్ ఇచ్చారు. కౌన్సిలింగ్ ప్రక్రియలో డెప్యూటీ డైరెక్టర్ అంజయ్య, సూపరింటెండెంట్ గోపవరపు స్టాన్లి రాజ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ పి.పాల్ పాల్గొన్నారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్స్ ఎట్టకేలకు లభించడంతో పలువురు నర్సింగ్ సిబ్బంది, నర్సింగ్ యూనియన్ నేతలు డాక్టర్ యాస్మిన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

వైద్య సిబ్బందికి పదోన్నతులు

ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో పనిచేస్తున్న పలువురు వైద్య సిబ్బందికి శనివారం పదోన్నతులు లభించాయి. మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఎంపీహెచ్ఏ ఫిమేల్) గా పనిచేస్తున్న ఐదుగురికి హెల్త్ ఎడ్యుకేటర్స్‌గా పదోన్నతి లభించింది. మల్టీపర్పస్ హెల్త్ సూపర్‌వైజర్‌గా (ఫిమేల్) పనిచేస్తున్న ఇరువురికి పబ్లిక్ హెల్త్ నర్సులుగా (పీహెచ్ఎన్) పదోన్నతి లభించింది. ఆర్డీ డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్, డెప్యూటీ డైరెక్టర్ అంజయ్య, సూపరింటెండెంట్ సుధీర్, సీనియర్ అసిస్టెంట్ సుబ్బారావు, కౌన్సెలింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు.

డీటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక



నరహరి



రమణయ్య

గుంటూరు ఎడ్యుకేషన్: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె.నరహరి (తూర్పు గోదావరి), ఎస్.వి.రమణయ్య (నెల్లూరు) ఎన్నికయ్యారు. గుంటూరు అమరావతి రోడ్డులోని నవీన విద్యా సంస్థలో శనివారం నిర్వహించిన రాష్ట్ర 16వ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా సీతజార్జ్, ఎస్.శ్రీనివాసరావు, పి.మాధవి, కార్యదర్శులుగా జి. మధు, ఆర్.వరుణ్‌కుమార్, జి.చంద్రశేఖర్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా కె.త్రినాథరావు, సభ్యునిగా కె.ఎస్.ఎస్. ప్రసాద్, ఉపాధ్యాయ క్రాంతి పత్రిక ప్రధాన సంపాదకునిగా కె.రత్నం, సంపాదకులుగా పి.వి.డి. ప్రసాద్, ఎం.ఎస్.కె. కిశోర్ ఎన్నికయ్యారు.

హజ్ యాత్రీకులకు ప్రత్యేక ఏర్పాట్లు భేష్

రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఇంతియాజ్ అహ్మద్



నంబూరు మదర్సాలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇంతియాజ్ అహ్మద్ తదితరులు

పెదకాకాని: రాష్ట్ర ప్రభుత్వం పవిత్ర హజ్ యాత్రీకులకు చేపట్టిన బస, ఏర్పాట్లు సంతృప్తికరంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఇంతియాజ్ అహ్మద్ తెలిపారు. హజ్ యాత్రికుల కోసం మండలంలోని నంబూరు సిరాజుల్ ఉలూమ్ మదర్సాలో బస, ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. ప్రాంగణమంతా తిరిగి స్థానిక హజ్ కమిటీని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తొలిసారిగా హాజీలు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి పవిత్ర మక్కా, మదీన నగరాలకు నేరుగా విమానాల్లో వెళ్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు సీఈవో షేక్ ఖాదర్, జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ ముక్తార్ బాష, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ షేక్ బాషిద్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ సయ్యద్ సుభాని, తహసీల్దార్ పి. రత్నం, ఎంపీడీవో బి.వి. మల్లేశ్వరరావు, ఈవోపీఆర్డీ రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి షేక్ సుభాని పాల్గొన్నారు.

పాత కక్షలతో వ్యక్తిపై దాడి

గుంటూరు ఈస్ట్: పాత కక్షలతో వ్యక్తిపై ఇద్దరు దాడి చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్వీఎన్ కాలనీకి చెందిన కత్తి శ్రీనివాసరావు శుక్రవారం మెడికల్ కళాశాల రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. ఈ సమయంలో పవన్‌కుమార్, ఆదిశేషులు దాడి చేశారు. బాధితుడు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూసార పరీక్షలతో రైతులకు మేలు



నంబూరు రైతు భరోసా కేంద్రంలో మాట్లాడుతున్న డీపీడీ రామాంజనేయులు

పెదకాకాని: భూసార పరీక్షల ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, నేల స్వభావం తెలుసుకుని పంటలు సాగు చేయవచ్చని గుంటూరు జిల్లా డెప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి. రామాంజనేయులు తెలిపారు. మండలంలోని నంబూరు రైతు భరోసా కేంద్రంలో శనివారం భూసార పరీక్షలు, పచ్చిరొట్ట ప్రాధాన్యతపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీపీడీ రామాంజనేయులు మాట్లాడుతూ ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో భూసార పరీక్షలకు మట్టి నమూనాల సేకరణ చేస్తున్నట్లు చెప్పారు. భూసార పరీక్షల ద్వారా పైరుకు అవసరాన్ని బట్టి ఎరువులు వాడుకోవచ్చని సూచించారు. వరికి ముందుగా పచ్చిరొట్ట పైరు సాగు చేసి పూత దశలో రోటోవేటర్ వేసి నేలలో కలియదున్నడం ద్వారా సారవంతమవుతుందని తెలిపారు. అన్ని రైతు భరోసా కేంద్రాల్లో 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రతి నెలా మొదటి శుక్రవారం ఆర్‌బీకే స్థాయిలో, రెండో శుక్రవారం మండల స్థాయిలో, మూడో శుక్రవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశాలు జరుగుతాయన్నారు. వీటి ద్వారా రైతుల సమస్యలు ఉన్నతాధికారులకు తెలియజేయవచ్చని తెలిపారు. సమావేశంలో ఏవో పి. సంధ్యారాణి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ప్రవాసాంధ్రుల కోసం..ఎన్టీఆర్ చిత్రాలు డిజిటలైజ్



మోపర్తి రత్నకుమారిని సత్కరిస్తున్న సాయిమాధవ్

తెనాలి: ఎన్టీ రామారావు నటించిన 276 చిత్రాలను డిజిటలైజ్ చేయించి, ఉత్సవాల తర్వాత కూడా వీక్షించేందుకు వీలుగా విదేశాల్లోని తెలుగువారికి అందించనున్నట్టు ప్రవాస భారతీయుడు, ప్రముఖ మానసిక వైద్యుడు డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి చెప్పారు. తెనాలిలో జరుగుతున్న ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సవాల్లో వారానికి అయిదు రోజుల చొప్పున ఏడాదిపాటు ఎన్టీఆర్ నటించిన సినిమాలను ఉచితంగా ప్రదర్శించినట్టు చెప్పారు. విదేశాల్లోని తెలుగువారు చూడాలన్న కోరికను వ్యక్తం చేయటంతో తానీ ప్రయత్నం చేపట్టినట్టు వివరించారు. ఎన్టీఆర్ శతజయంతి మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి ఇక్కడి దేవీప్రియ ఫంక్షన్ హాలులో ఏర్పాటైన సభలో ముగ్గురు కళారంగ ప్రముఖులకు ఎన్టీఆర్ శతాబ్ది రంగస్థల పురస్కారాలను ప్రదానం చేశారు. అధ్యక్షత వహించిన ప్రముఖ సినీ మాటల రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా మాట్లాడుతూ కళల కాణాచి తెనాలి పేరును శతాబ్ది ఉత్సవాలు ద్విగుణీకృతం చేసి స్థిరపరిచినట్టు చెప్పారు. ఒంగోలుకు చెందిన ప్రఖ్యాత టీవీ, రంగస్థల నటీమణి మోపర్తి రత్నకుమారి, సుప్రసిద్ధ రూపశిల్పి, తెలుగు యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ మల్లాది గోపాలకృష్ణ, ప్రఖ్యాత సినీ, టీవీ, రంగస్థల నటుడు సంజీవిని ఎన్టీఆర్ శతాబ్ది రంగస్థల పురస్కారాలతో సత్కరించారు.

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా

ప్రత్తిపాడు: ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా కోరారు. సంఘం ప్రత్తిపాడు తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ప్రభుత్వ ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సయ్యద్ చాంద్ బాషా మాట్లాడుతూ ఈ నెల 22న మొదలైన ఉద్యమం రోజురోజుకూ ఉధృతం చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ప్రసాద్, గుంటూరు సిటీ సహాధ్యక్షుడు పవన్, ఉపాధ్యక్షుడు పెదరత్తయ్య, ప్రత్తిపాడు తాలూకా యూనిట్ అధ్యక్షుడు చెన్నయ్య, కార్యదర్శి లాబాన్ పాల్గొన్నారు.

KANNA SCHOOLS REQUIRE
• Teachers for all Classes and Subjects (Higher & Lower)
• Principal (Woman)
• The Best Salary for the best
• Resumes to be Sent to Whatsapp No.
9440644248
★ Railpet ★ Vallurivari Thota ★ R.T.C. Colony ★ Gunturuvari Thota ★ Old Guntur ★ Guntur.

కావలెను
కెమిస్ట్రీ, మ్యాథ్స్ (9th-10th), (జీతం : 25000)
ఇంగ్లీషు, సోషల్ బోధించుటకు టీచర్లు మరియు లైబ్రేరియన్ కావలెను
ఇంటర్వ్యూలు జరుగుచున్నవి
సెయింట్ జోసెఫ్ (CBSE)స్కూల్
పెదకాకాని, గుంటూరు
6302029348

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు ఈస్ట్)
90109 57733
Office mail : sakshigntadvt@gmail.com